క్లుప్తంగా

ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు



పాత గుంటూరు: శ్రీనగర్‌లోని శ్రీ లలితా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ రాజ శ్యామల పీఠం ఆధ్వర్యంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. వారాహి అమ్మ వారికి విశేష ద్రవ్యాలతో కన్నుల పండువగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్రనామార్చనలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. పీఠ వ్యవస్థాపకులు వెలమకన్ని నాగార్జున శర్మ, సందీప్ శర్మ, వల్లూరు హనుమత్ సాయి పాల్గొన్నారు.

మూడు దేవస్థానాల హుండీ లెక్కింపు



పాత గుంటూరు: దేవదాయ శాఖ పరిధిలోని కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం, శ్రీ జగన్నాథస్వామి దేవస్థానం, లాలాపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపును బుధవారం నిర్వహించారు. జగన్నాథస్వామి దేవస్థానానికి రూ. 5,045, ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.4,79,989, వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 4,02,098 ఆదాయం వచ్చింది. మూడు దేవస్థానాలకు మూడు నెలలకు గానూ రూ.8,87,132 ఆదాయం వచ్చిందని అసిస్టెంట్ కమిషనర్, ఏవో డి. శ్రీనివాసరావు తెలిపారు. లెక్కింపులో పర్యవేక్షణాధికారి కె. వీరాంజనేయులు, చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి, సభ్యులు విశాలక్ష్మి జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటరత్నం, అనిత, శివకుమారి, సిబ్బంది, సద్గురు సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనపై ఇంటింటి ప్రచారం



గుంటూరు మెడికల్: పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణబాబు కాలనీలో ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిది సంవత్సరాల పాలనలో ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. నరేంద్ర మోదీకి మద్దతుగా 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో అప్పిసెట్టి రంగారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, రాంబాబు, అనుమోలు ఏడుకొండలు, పోతురాజు వెంకట్, మోతె శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు, పరమేశ్వరావు పాల్గొన్నారు.

పట్టాభిపురం హైస్కూలుకు టీవీ బహూకరణ



నెహ్రూనగర్: రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో పట్టాభిపురం హైస్కూలుకు స్మార్ట్ టీవీని బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రావి బాలకృష్ణ మాట్లాడుతూ విద్యను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనేక సంవత్సరాలుగా పలు కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మహిళా చైర్మన్ టి. మధుస్మిత, కార్యదర్శి ప్రియదర్శిని, సభ్యులు అవినాష్, పట్టాభిపురం హైస్కూలు ప్రిన్సిపాల్ డి. కల్యాణి, అకడమిక్ అడ్వైజర్ ఎం. రమణి పాల్గొన్నారు.

షాపులో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పాన్ షాపులో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రమౌళీనగర్‌లో నివసించే జి.శేషగిరి రావు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పాన్ షాపు నిర్వహిస్తుంటారు. ఈనెల 28వ తేదీ ఉదయం షాపు వద్దకు వెళ్లగా తాళం పగులగొట్టి ఉంది. సిగరెట్లు, ఇతర సరుకులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో నగర సమగ్రాభివృద్ధికి కృషి

- ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి

నెహ్రూనగర్: నగర సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా పూర్తి సహాయ సహకారాలు అందుతున్నాయని ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో బుధవారం ఆయన మేయర్ కావటి, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, నగర కమిషనర్ కీర్తి చేకూరితో నగరాభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నగరంలో పాలక వర్గం, అధికారుల సమన్వయంతో వార్డుల వారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా పశ్చిమ నియోజకవర్గంతో పోల్చితే తూర్పు నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో పనుల్లో జాప్యం జరిగిందని చెప్పారు. బీఆర్ స్టేడియం అభివృద్ధికి శాప్ అధికారులతో మాట్లాడి సత్వర చర్యలు తీసుకునేలా చర్చిస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ. 560 కోట్లతో గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనుల్ని నిర్వహించామని తెలిపారు. నగరంలో ప్రతిపాదించిన ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఆర్వోబీల అనుమతులు, నిర్మాణంపై త్వరలో రైల్వే మంత్రిని స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు: మేయర్

నగర మేయర్ కావటి మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులతో కలసి తూర్పు నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించామన్నారు. ఆయా ప్రాంతాల్లో సమస్యల్ని అధికారులతో చర్చించి, త్వరలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో ప్రధాన సమస్య అయిన మురుగు పారుదలకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించామని తెలిపారు. పీకల వాగు అభివృద్ధికి రూ. 3.50 కోట్లతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరంలో కుల,మత, పార్టీలకు ప్రాంతాలకు అతీతంగా ప్రతి వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ తనకు వ్యక్తిగత ఏజెండా ఏమీ లేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే పాటుపడుతున్నానని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో అస్తవ్యస్త డ్రైనేజీ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఆవేదనే అధికారుల దృష్టికి తెచ్చామని వివరించారు. అందరి సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పనుల వేగవంతానికి ప్రత్యేక ఆదేశాలు

కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నగరంలోని ప్రతి వార్డు అభివృద్ధికి స్థానిక కార్పొరేటర్ భాగస్వామ్యంతో ప్రతిపాదించిన పనుల వేగవంతానికి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. వార్డుల సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించడానికి కార్పొరేటర్లకు ప్రతి శుక్రవారం ప్రత్యేక సమయం కేటాయించామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలపై నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని తెలిపారు. గత కౌన్సిల్ సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే ప్రతిపాదించిన ఒక కల్వర్ట్ నిర్మాణ పనులు చివర దశలో ఉన్నాయని, మరో రెండు కల్వర్టులు, సీసీ డ్రెయిన్ నిర్మాణం కూడా పూర్తి చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ. 9.73 లక్షలతో చర్యలు తీసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్ర బాబు, షేక్ సజీల, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఈఈ కోటేశ్వర రావు, డీఈఈలు కల్యాణ్‌రావు, శ్రీనివాసరెడ్డి, ఏఈలు, గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, షేక్ షౌకత్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనుల పూర్తి



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా మేయర్ కావటి తదితరులు

పట్నంబజారు: అభివృద్ధికి నిలువుటద్దంలా గుంటూరును ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్తామని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం, నందివెలుగు రోడ్డు, కాకుమాను వారితోటలోని వెల్ఫేర్ సెంటర్‌ను బుధవారం నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలసి పరిశీలించారు. స్టేడియంలో సమస్యల్ని వాకర్స్, అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. వాకర్స్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని స్పష్టం చేశారు. అనంతరం నందివెలుగు రోడ్డును పరిశీలించి, అక్కడ సమస్యల్ని గుర్తించారు. కార్పొరేషన్ అధికారులతో చర్చించి త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అక్కడ నుంచి కాకుమానువారితోటలోని వెల్ఫేర్ సెంటర్‌లో కార్మికశాఖ స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణం, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటితో ఎంపీ అయోధ్య చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మేలు చేయడం, అభివృద్ధి పనులు చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో అన్ని పనులు పూర్తి చేస్తామని, ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడింపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవ రాష్ట్రానికి ఆదర్శం



కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రతి నెలా ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చొరవ రాష్ట్రానికే ఆదర్శమయ్యిందని ఏపీ ఎస్ఆర్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ కొనియాడారు. కలెక్టరేట్ చాంబర్‌లో బుధవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారమైన తీరును గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు అతి సులభంగా పరిష్కారమైపోతున్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు అద్భుతమైన సేవ చేయొచ్చని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘ నాయకులతో కలెక్టర్ పలు అంశాల్ని చర్చించారు.

బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి



నెహ్రూనగర్: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ కాండ్రకుంట గురవయ్య తెలిపారు. కొండ వెంకటప్పయ్య కాలనీలో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్, క్రాఫ్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం .. బాలల ఉజ్వల భవిష్యత్తును కాపాడుదాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలందరూ బడికి వెళ్లే విధంగా చూడాలని తల్లిదండ్రుల్ని కోరారు. 18 సంవత్సరాలలోపు బాలల్ని పనిలో పెట్టకోవడం నేరమన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా బాలల రక్షణ కమిటీ సభ్యులు, బాలల పంచాయతీ సభ్యులు పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకయ్య, కేఎస్ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాంబాబు పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో మహిళ ఆత్మహత్యాయత్నం

సత్వరం స్పందించి కాపాడిన పోలీసులు



మహిళను కాపాడి ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

బాపట్లటౌన్: మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గుంటూరు స్తంభాల గరువు సెంటర్‌లో నివాసం ఉండే మామిళ్లపల్లి రమాదేవి కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకొని చనిపోవాలనే ఉద్దేశంతో సూర్యలంక సముద్రతీరానికి వచ్చి, నీటిలో లోతుకు వెళ్లి పో తుండడంతో సూర్యలంక అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గోపి గమనించాడు. వెంటనే గజ ఈతగాళ్లను అప్రమత్తం చేసి అందరు క లిసి ఆమెను ఒడ్డుకు తీసుకొని వచ్చి ప్రథమ చికిత్స చేయించారు. వెంటనే మెరుగైన చికిత్స కోసం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. మహిళను కాపాడిన పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.

నోడల్ అధికారిగా ఎస్‌బీ సీఐ నియామకం

నగరంపాలెం: బక్రీద్ పండుగ సందర్భంగా యానిమల్ రెస్క్యూ జిల్లా నోడల్ అధికారిగా స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) సీఐ నరసింహారావుని నియమించినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు తెలియజేయాలంటే 86888 31391కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ప్రకటించాలి

గుంటూరు రూరల్: మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుకు భారతరత్న ప్రకటించాలని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ సభ్యుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ డిమాండ్ చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య కార్యాలయంలో బుధవారం పీవీ 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాండురంగ విఠల్ మాట్లాడుతూ పి.వి. నరసింహారావు గొప్ప మేధావిగా పేర్కొన్నారు. మైనార్టీలో ఉన్న ప్రభుత్వాన్ని ఐదేళ్లు నిర్విఘ్నంగా పరిపాలించారన్నారు. దేశాన్ని ప్రపంచీకరణ దిశగా నడిపించిన ధీశాలి అని, గ్లోబలైజేషన్ సృష్టికర్తగా పేరు తెచ్చుకొన్నారని తెలిపారు. కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ అపర మేధావి పీవీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాచిరాజు మురళీకృష్ణ, మాదిరాజు సాయి తరుణ్, ఒరుగంటి విశ్వనాథం పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

జగనన్న లేఅవుట్‌లో అధికారుల బృందం పర్యటన



హౌసింగ్ లే అవుట్‌లో పర్యటిస్తున్న అధికారుల బృందం

ప్రత్తిపాడు: కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో శ్రీరమ్య, తహసీల్దార్ సిద్దార్థ నివాసితులకు భరోసానిచ్చారు. ప్రత్తిపాడులోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న కొందరు మహిళలు మంగళవారం తహసీల్దార్, ఎంపీడీవోలను కలసి సమస్యల్ని ఏకరువు పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపీడీవో, తహసీల్దార్లతో కూడిన అధికారుల బృందం కాలనీలో పర్యటించింది. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిశీలించింది. కాలనీలో మురుగు నీరు ముందుకు పారేందుకు తీసుకోవాల్సిన చర్యల్ని మ్యాప్ ఆధారంగా హౌసింగ్, పీఆర్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలసి చర్చించారు. అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు సమృద్ధిగా తాగునీటి కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకోవచ్చన్న అంశాల్ని చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కాలనీవాసులు ఇబ్బంది పడకుండా ఒకదాని వెంట ఒకటి అభివృద్ధి పనుల్ని చేసుకుంటూ వస్తున్నట్లు చెప్పారు. మురుగు నిలబడకుండా పారేలా యుద్ధ ప్రాతిపదికన కచ్చా డ్రెయిన్లు తీయిస్తామని తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ ప్రాధాన్యతాంశంగా ప్రభుత్వం జగనన్న హౌసింగ్ లేఅవుట్స్‌లో మౌలిక వసతులు కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈలు వినీల్, సురేష్, వైకేపి ఏపీఎం సురేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించండి

లబ్ధిదారులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించి, ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని ఎంపీడీవో ఏ. శ్రీరమ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. నిర్మించుకోలేని వారికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందన్న విషయాన్ని వివరించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం సురేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

ప్రత్తిపాడు: రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది కచ్చితంగా ప్రతిరోజూ రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయాధికారి కె. అరుణ కుమారి ఆదేశించారు. ప్రత్తిపాడులోని రైతు భరోసా కేంద్రాల్లో ఆమె బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అటెండెన్స్ రిజిస్టర్‌తో పాటు పలు రికార్డుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొన్నటి వరకు ఆర్‌బీకేలో సిబ్బంది కొరత సమస్య ఉందన్నారు. అయితే, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు దాన్ని అధిగమించామని చెప్పారు. మండలంలో మొత్తం పదమూడు ఆర్‌బీకేలకు గానూ పదకొండు కేంద్రాలకు వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈవోలును ఉన్నతాధికారులు కేటాయించారని తెలిపారు. వీరంతా ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కేంద్రాల్లో రైతాంగానికి అందుబాటులో ఉండాలని చెప్పారు. వ్యవసాయ సీజన్ ఆరంభమైన నేపథ్యంలో ఆర్‌బీకేలకు విత్తనాలు, ఎరువులు వస్తున్నాయని, వాటిని రైతులకు సకాలంలో అందించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కిరాణా షాపు ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ దగ్గర జరిగిన ఘర్షణపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రామన్నపేట అమూల్య టవర్స్ వద్ద బొంతల సుబ్రహ్మణ్యం కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. ఈనెల 14న సుబ్రహ్మణ్యం షాపు ముందు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేస్తుండగా, ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. కర్రతో సుబ్రహ్మణ్యంపై శ్రీనివాసరావు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై...

ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళను ప్రేమిస్తున్నానని చెప్పిన వ్యక్తి మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి ఫేస్‌బుక్‌లో కొరిటెపాడుకు చెందిన గురుప్రసాద్ పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నట్లు నటించాడు. తన అవసరాలు చెప్పి విడతల వారీగా మహిళ వద్ద నుంచి రూ. 10 లక్షల వరకు తీసుకున్నాడు. అనంతరం డబ్బులు ఇవ్వకపోగా, అడిగితే మహిళను దుర్భాషలాడాడు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధి లోని కాజ గ్రామంలో తాళాలు వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం మంచిరాజు రాధాకృష్ణమూర్తి పౌరహిత్యం చేస్తూ కాజలో నివాసముంటున్నాడు. ఈ నెల 22వ తేదీ వల్లభాపురంలోని నివాసముంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి 27వ తేదీ సాయంత్రం ఇంటికి రాగా తాళాలు పగలకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులో సుమారు 40 గ్రాముల బంగారు, వెండి వస్తువులు, రూ.4లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముస్లింలకు మేయర్ బక్రీద్ శుభాకాంక్షలు

నెహ్రూనగర్: ముస్లింలకు మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ, మతసామరస్యానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

2న గ్రూప్-1పై ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్-1, 2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం జూలై 2న ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అమిగోస్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకుడు పి. కృష్ణప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 9.00 గంటలకు జరగనున్న సదస్సులో భాగంగా గ్రూప్-1, గ్రూప్-2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులతో సమగ్ర అవగాహన కల్పిస్తామని తెలిపారు. దీంతో పాటు గ్రూప్-1 ప్రిలిమ్స్ రాష్ట్రస్థాయి మాక్ పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని, ఇతర వివరాలకు 040-35052121, 9000230734 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు సత్వర పరిష్కారం

పాత గుంటూరు: ప్రయాణికుల సమస్యల్ని సత్వరం పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని గుంటూరు- 2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ తెలిపారు. డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంలో ఆయన ప్రజలు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

- గుంటూరు బస్టాండ్ నుంచి తెనాలికి నాన్ స్టాప్ సర్వీసులు ఏర్పాటు చేయాలని గుంటూరు నుంచి ఆవుల అప్పారావు కోరారు.
- గుంటూరు బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గుంటూరు నుంచి నరేంద్రనాథ్ కోరారు.
- గుంటూరు నుంచి తెనాలి వయా నంబూరు మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గుంటూరు నుంచి శ్రీకాంత్ కోరారు.

గుంటూరు చానల్ పొడిగింపు వెంటనే చేపట్టాలి

గుంటూరు వెస్ట్: జిల్లా రైతులతో పాటు పక్క జిల్లాల వారికీ బహుళ ప్రయోజనాలు కలిగే గుంటూరు చానల్ పొడిగింపును వెంటనే ప్రారంభించాలని గుంటూరు చానల్ పోరాట కమిటీ నాయకుడు డాక్టర్ కొల్లి రాజమోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. 2019లో ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు.గుంటూరు చానల్ పొడిగింపు కోసం రూ. రూ.270 కోట్లు ఖర్చు అవుతుందని, నాబార్డ్ కూడా రుణమిచ్చేందుకు ముందుకొచ్చిందని చెప్పారు. చానల్ పొడిగింపు వల్ల ఈ ప్రాంతంలోని రైతుల కష్టాలు చాలా వరకు తీరిపోతాయని పేర్కొన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ నిరసన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భార్య, కుమారుడిపై కత్తితో దాడి



గాయపడిన సరిత

పెదకాకాని: భార్య, అడ్డు వచ్చిన కుమారునిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన ఉప్పలపాడులో చోటు చేసుకుంది.గ్రామానికి చెందిన వరగాని జయరావుకు 19 ఏళ్ల కిందట సరితతో వివాహమైంది. వారికి ఉదయ బాబు, జాన్ బాబు ఇద్దరు సంతానం . జయరావు మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలల కిందట సరిత గుంటూరుకు చెందిన రఘుతో ఫోన్లో మాట్లాడుతుండగా గమనించిన జయరావు మందలించాడు. అప్పటినుండి తరచూ భార్య సరితపై గొడవ పడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈనెల 27వ తేదీ రాత్రి పథకం ప్రకారం భార్య ఇంట్లో ఉండగా తలుపులు వేసిన జయరావు కూరగాయలు కోసే చాకుతో పొడిచి హత్యాయత్నం చేశాడు. స్వల్ప గాయాలతో బయటపడిన సరిత కేకలు వేయడంతో బయటున్న ఇద్దరు కుమారులు తలుపులు కొట్టి తీయించారు. కోపోద్రిక్తుడైన జయరావు అడ్డువచ్చిన చిన్న కుమారుడు కూడా కత్తితో పొడిచి పలుచోట్ల గాయపరిచాడు. పెద్దగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు అక్కడ చేరుకొని 108 వాహనంలో బాధితులను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు జయరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.